ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 29 ఫిబ్రవరి 2024

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ట్రైబల్ వర్సిటీలో అడ్మిషన్లు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



7



సమ్మక్క గుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సమ్మక్క గుడి వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న పూజారులు





వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


ఘనంగా తిరుగువారం

- మేడారం మహాజాతరలో చివరిఘట్టం పూర్తి
- ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు
- మొక్కులు చెల్లించుకునేందుకు తరలొచ్చిన జనం



7

చివరి ఘట్టం ఘనంగా ముగిసింది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర పరిసమాప్తమైంది. చివరి వేడుక అయిన తిరుగువారం పండుగ బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ పూజారులు ఇలవేల్పులైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల ఆలయాలను శుద్ధి చేశారు. అలుకు పూతలతో మహిళలు తీర్చిదిద్దారు. ఇష్టదైవాలకు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు యాటమొక్కులు తీర్చుకున్నారు. కాగా, తిరుగువారం పండుగకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో మేడారం పరిసరాలు సందడిగా కనిపించాయి. జంపన్నవాగులో స్నానం చేసి అమ్మవార్ల గద్దెలకు మొక్కుకున్నారు. - మేడారం



'మేడిగడ్డ' మే సవాల్!

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- కాంగ్రెస్‌కు రాజకీయాస్త్రంగా పిల్లర్ల కుంగుబాటు
- ప్రతి దాడికి సిద్ధమైన 'గులాబీ'దళం
- రేపు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల 'చలో మేడిగడ్డ'
- కేటీఆర్, హరీశ్‌రావు సహా కీలక నేతల రాక
- 2న కరీంనగర్ సభకు హాజరవనున్న కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల వేళ రాజుకుంటున్న మేడిగడ్డ వేడి

వరంగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడిగడ్డ పోరుగడ్డగా మారుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌పై తొలి నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్.. అనూహ్యంగా అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో దాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. స్వయంగా కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీకి వెళ్లి పరిశీలించారు. రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని కాంగ్రెస్ దుమ్మెత్తి పోస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కూడా ఎదురుదాడికి దిగుతోంది. మూడు పిల్లర్లు కూలితే ప్రాజెక్టే పనికి రాదంటున్నారని అసహనం వ్యక్తం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌కు దీటుగా చలో మేడిగడ్డ పేరుతో మార్చి 1న బీఆర్ఎస్ తన ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇలా రెండుపార్టీల నేతలు 'మేడిగడ్డ'మే సవాల్.. తేల్చుకుందాం అంటూ మాటల తూటాలు పేలుస్తుండటం.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

అందరిచూపు మేడిగడ్డ వైపే..

సుమారు రూ.98వేలకోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ అత్యంత కీలకమైనది. అయితే గత ఏడాది అక్టోబరు 21న రాత్రి బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 21వ పిల్లర్ పెద్ద శబ్దంతో కుంగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయం కావటంతో ప్రతిపక్షాలకు మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ప్రచారాస్త్రంగా మారింది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఏకంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని నవంబరు 2న మేడిగడ్డకు తీసుకెళ్లిన కుంగిన బ్యారేజీని చూపించి, నాణ్యత లోపంతో బ్యారేజీ కుంగిందని, కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. అదే సమయంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్ లాంటివారు సైతం మేడిగడ్డను సందర్శించి విమర్శలు గుప్పించారు. నవంబరులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ బ్యారేజీపై మరింతగా దృష్టి పెట్టి బీఆర్ఎస్‌ను ఇరుకాటంలో పెట్టింది.

గత ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ ఫోకస్







కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బ్యారేజీ కుంగుబాటుపై వేగంగా విచారణ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ వైఫల్యం వెనుక కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరు అనేదానిపై ప్రధానంగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీంతో డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. 17వ తేదీన నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రతో పాటు ఎల్అండ్‌టీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఫిబ్రవరి 7వ తేదీన ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లుపై ప్రభుత్వం వేటు వేసింది. ఫిబ్రవరి 13న సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మేడిగడ్డలో పర్యటించారు. మంత్రులతో పాటు కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డను సందర్శించారు. వరుసగా ప్రభుత్వం మేడిగడ్డపై ఫోకస్ చేసింది. మేడిగడ్డ కుంగిపోవటంతో బ్యారేజీని పునరుద్ధరించటం కష్టమని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును పునరుద్ధరిస్తామనే సంకేతాలను ప్రభుత్వం ఇస్తోంది. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుతో కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగు నీరు ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది.







కౌంటర్‌కు 'గులాబీ' సన్నాహాలు

మేడిగడ్డ బ్యారేజీ కుంగుపాటుపై ప్రభుత్వం వరుసగా విచారణలు, సమీక్షలు, సీఎం, మంత్రులు పర్యటనలతో కాళేశ్వరం లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరి 13వ తేదీన సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలను కూడా మేడిగడ్డకు తీసుకరావటంతో గులాబీ పార్టీ సందిగ్ధంలో పడింది. మౌనంగా ఉంటే కాళేశ్వరంపై ప్రభుత్వం, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం

మిగతా 6వ పేజీలో..

టార్గెట్ ఎంపీ ఎన్నికలు

వచ్చే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వ్యూహాత్మంగా మేడిగడ్డ బ్యారేజీ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, జహీరాబాద్, నల్లగొండ, భువనగిరి లోక్‌సభ పరిధిలోని రైతాంగానికి సాగు నీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో ఎత్తిపోతలు నిలిచిపోయాయి. అంతేకాకుండా ప్రాజెక్టు పనులు కూడా నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు పనికిరాదని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి వెళుతుండటంతో గులాబీ పార్టీ కౌంటర్ పాలిట్రిక్స్‌లోకి దిగింది. మూడు పిల్లర్లను పునరిద్ధరిస్తే సరిపోతుందని, కేసీఆర్‌కు పేరు రావద్దని కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందని ఆరోపిస్తు ఎన్నికల్లో ప్రచారానికి సిద్ధం అవుతోంది. దీంతో మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికల పోరుకు అడ్డగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



వంగరలోని పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్

కాంగ్రెస్, బీఆర్ఎస్ చెల్లని రూపాయిలు..

- నాడు కాంగ్రెస్ పీవీ అంత్యక్రియలను కూడా నిర్వహించలేదు
- అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలంటున్న కేసీఆర్
- వంగరలో విలేకరులతో ఎంపీ బండి సంజయ్

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మహనీయులను అవమానపరుస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ప్రపంచదేశాలు కొనియాడిన పీవీ నర్సింహారావును కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, ఇక రాజ్యాంగాన్ని మార్చాలంటూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను బీఆర్ఎస్ అవమానించాయని బుధవారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ నర్సింహారావు నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ దేశాలు పీవీని కొనియాడుతుంటే సొంత కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయన మరిచిపోయిందని, పీవీ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త, బహుభాషా కోవిధుడు, ఆర్థిక పితామహుడు, ఆయన స్ఫూర్తి ముందు తరాలకు తెలియాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆయనకు భారతరత్నను గర్వంగా ప్రకటించిందన్నారు. కానీ ఆయన అంత్యక్రియలను సరిగా చేయలేకపోయిన కాంగ్రెస్ పార్టీ తీరుకు పీవీ కుటుంబం ఆవేదనకు గురైందన్నారు. ఇక కేసీఆర్ కూడా అందితే జుట్టు, లేకపోతే కాళ్లు అన్న చందంగా ఉంటారన్నారు. పీవీ శతజయంత్యుత్సవాల సందర్భంగా రూ.కోట్లు వెచ్చించి పీవీ స్మృతివనం, పీవీ విజ్ఞాన వేదిక, పీవీ మ్యూజియం, సమ్మక్క క్రాస్ రోడ్ నుంచి వంగర వరకు డబుల్ రోడ్డు లాంటివి ప్రకటించారని, వీటన్నికి రూ.43కోట్లు ఖర్చు అవుతాయని ఆనాటి బీఆర్ఎస్ మంత్రులు ప్రకటించారని, కానీ పనులు మాత్రం అర్థంతరంగా ఆగిపోయాయన్నారు. పీవీ మన తీవీ అని పగల్భాలు పలికిన కేసీఆర్ అభివృద్ధి పనులు మాత్రం చేయించలేకపోయారన్నారు. అలాగే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలంటున్న కేసీఆర్.. అంబేద్కర్ జయంతికి గానీ, వర్ధంతికి గానీ హాజరుకాదని ఆరోపించారు. ఈ సమావేశంలో పీవీ మనవడు ఎన్వీ సుభాష్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ,

మిగతా 8వ పేజీలో..

సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి

- వంగరలో ఉద్రిక్తత

7



జల్సాల కోసం దొంగతనాలు

- ముఠాను అరెస్టు చేసిన పోలీసులు
- రూ.5.50 లక్షల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 28 : జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడే ముఠాను వరంగల్ సీసీఎస్, ఏనుమాముల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన సొత్తును స్వాధీన పర్చుకున్నట్లు మామునూరు ఏసీపీ సతీశ్‌బాబు తెలిపారు. వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏసీపీ సతీశ్‌బాబు నిందితుల అరెస్టు చూపించి వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాపోలు రామకృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కేతిరి కిరణ్, పప్పుల సంపత్ ముఠాగా ఏర్పడి ఏనుమాముల, పరకాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడ్డారు. ఏనుమాములలోని కారల్‌మార్క్స్ కాలనీ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఈ ముగ్గురిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.5.50 లక్షల సొత్తును స్వాధీన పర్చుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న ఏనుమాముల సీఐ పి.కిషన్, సీసీఎస్ సీఐ శంకర్‌నాయక్, ఎస్సై పోగుల శ్రీకాంత్, సీసీఎస్ ఎస్సై సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు మున్నా, వేణు, రవి, వెంకన్న, కిరణ్, మహేందర్, విజయ్, యుగేందర్, రవీందర్‌లను ఏసీపీ సతీశ్‌బాబు అభినందించారు.

కాళేశ్వరాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు

- 17ఎంపీ స్థానాలు గెలిచి మగాడివనిపించుకో..
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్
- అవినీతి జరిగితే విచారణ చేసి చర్యలు తీసుకోవాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28: సాంకేతిక, ఇతర లోపాలతో మేడిగడ్డ మూడు పిల్లర్లు కుంగి ఉంటాయని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలి కానీ రాజకీయాల కోసం కాళేశ్వరాన్ని వాడుకోవద్దని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హితవు పలికారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలపై విరుచుకుపడుతూ మగతనం అనే పదం పదేపదే ఉచ్చరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. లోక్ సభ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాలు గెలిచి తన మగ తనాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తన భాష మార్చుకుని హుందాగా వ్యవహరిస్తాడనుకున్నామని కానీ రేవంత్‌రెడ్డి తాను సీఎం అనేది మరిచి మాట్లాడుతున్నాడని విమర్శించారు. కేసీ ఆర్ పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఆయన కొనియాడారు. కేసీఆర్ సాధించిన విజయాలను వైఫల్యాలుగా చిత్రీకించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని కడియం ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరి తెలంగాణ ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చుతోందన్నారు. మేడిగడ్డను రాజకీయాల కోసం వాడుకోకుండా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మరమ్మతులు చేయించి రైతులకు ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. మేడిగడ్డ పూర్తిగా కొట్టుకుపోవాలనే దుర్మార్గపు ఆలోచనలో కాంగ్రెస్ ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మానుకుని ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించేదే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఇప్పటికీ ఇందిరాగాంధీ పేరు చెప్పంది ఆ పార్టీకి పూట గడవదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీగా మారిందని, ఆప్ కంటే అధ్వానంగా మారిందని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి భయపడాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదన్నారు. కానీ సొంత పార్టీ వారితోనే సీంకు ముప్పు ఉందని హెచ్చరించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు వెల్లడిం చేందుకే మార్చి 1న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాళేశ్వ రం వెళుతున్నట్లు కడియం పేర్కొన్నారు. సమా వేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.

వరంగల్ ఆర్‌డీవోగా స్రవంతి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌డీవోల బదిలీల్లో భాగంగా వరంగల్ ఆర్‌డీవోగా స్రవంతి బ్రహ్మారౌతు నియమితులయ్యారు. ఇక్కడ ఆర్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న వాసుచంద్ర నారాయణపేటకు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న స్రవంతి వరంగల్‌కు రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లాకు సంబంధించి నేషనల్ హెల్త్ మిషన్‌లో వివిధ విభాగాల్లో 32 ఖాళీలు ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చామని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ దరఖాస్తులను అందజేయాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ప్రథమ సంవత్సరంలో 94.4 శాతం హాజరు
- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఏసీపీ, డీఐఈవో



పోచమ్మమైదాన్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28 : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచే పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, ఉదయం 7.30 గంటల నుంచే తల్లిదండ్రులు పిల్లలను సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరవేశారు. మొదటి రోజు ప్రథమ సంవత్సరంలో 94.4 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,363 మంది, వొకేషనల్ 1,183 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, జనరల్‌లో 5,094, వొకేషనల్ విభాగంలో 1,085 మంది హాజరయ్యారు. మొత్తంగా 367 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. కలెక్టర్ పి.ప్రావీణ్య వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ఎస్ఆర్, కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు, కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులు చేపట్టిన చర్యలను ఆమె తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల నిర్వాహకులు అక్కడున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. గదుల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి కల్పించిన వసతులపై ఆరా తీశారు.

వరంగల్ బట్టల బజార్‌లోని ఆంధ్ర బాలికా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మట్టెవాడ సీఐ గోపి సందర్శించి పరీక్ష జరుగుతున్నతీరును పరిశీలించారు. డీఐఈవో కాక మాధవరావు ఎల్‌బీ కళాశాల, ఇస్లామియా, ఎస్ఆర్ గర్ల్స్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరుతెన్నులను పరిశీలించారు.

జులాజికల్ పార్కు తనిఖీ

సుబేదారి, ఫిబ్రవరి 28: హనుమకొండలోని కాకతీయ జులాజికల్ పార్కును రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ. వాణిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. జులాజికల్‌పార్కుతో పాటు హరితనిధి, కేయూ నర్సరీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెక్రెటరీ వాణిప్రసాద్ జూపార్కు అధికారులకు, సిబ్బందికి వణ్యప్రాణుల సంరక్షణకై పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ఫారెస్టు అధికారులు శివానీ డోగ్రా, బి. లావణ్యతో పాటు ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భద్రకాళి శేషు, రాకేష్‌రెడ్డి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 28: సనాతన ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భద్రకాళి అమ్మవారి ప్రధానార్చకుడు శేషు అన్నారు. ప్రతీ ఏటా నిర్వహించినట్లుగానే ఈ యేడు ఇండస్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో మహా శివరాత్రి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి చైతన్యవంతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శేషుతో పాటు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పరశివుడి ఔనత్యాన్ని చాటడానికి ఇండస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లు శివతత్వానికి పెట్టిన పేరని అలాంటి నగర విశిష్టతను తెలియజేయడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న విశిష్ట వ్యక్తులకు కాకతీయ పురస్కారం ఇచ్చి గౌరవించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ పార్వతి కల్యాణం, బ్రహ్మ శ్రీ గంగాధర శాస్త్రి, రాధామనోహర్ దాస్ ప్రవచనాలు, సప్తహారతి, పేరిణి శివతాండవంతో పాటు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, శరణ్ అర్జున్, వివిధ సినీ జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంకా మహా శివరాత్రి కార్యక్రమ నిర్వాహక కో ఆర్డినేటర్ కత్తుల అభిషేక్, వెలగందుల దీపక్ తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' మే సవాల్!

(5వ పేజీ తరువాయి)

ప్రజల్లోకి వెళుతోందని, కౌంటర్ అటాక్ చేయాలని గులాబీ పార్టీ భావిస్తోంది. దీంతో మార్చి 1వ తేదీన చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాళేశ్వ రం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని వాదిస్తోంది. కేవలం మూడు వేల కోట్లు వెచ్చించిన మేడిగడ్డ బ్యారేజీలోని మూడు పిల్లర్లు కుంగితే.. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోం ది. బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కుంగిన పిల్లర్లను మరమ్మతు చేసి, కాళేశ్వరం ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తూ చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ పర్యటనకు గులాబీ పార్టీ ప్లాన్ చేస్తోంది. మార్చి 2వ తేదీన కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్‌కు కౌంటర్ ఇవ్వాలని భావిస్తోంది. ఈ సభలో స్వయంగా కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనున్నారు. అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగితే.. అప్పటి నుంచి ఈ ఘటనపై కేసీఆర్ స్పందించలేదు. అయితే కరీంనగర్ సభలో కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనుండటంతో గులాబీ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది.







ఘనంగా తిరుగువారం





మేడారం మహాజాతరలో చివరిఘట్టం పూర్తి

ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు

మేడారం, ఫిబ్రవరి 28 : మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ క్రమంలో సంప్రదాయం ప్రకారం చివరిఘట్టంగా నిర్వహించే తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనదేవతలకు వడ్డెలు (పూజారులు) ప్రత్యేక పూజలు చేశారు. గద్దెలు, గ్రామంలోని గుడిని శుద్ధి చేశారు. ఆడపడుచులు.. అలుకుపూతలతో రంగురంగుల ముగ్గులు వేసి అందంగా అమ్మవార్ల గద్దెలను అలంకరించారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పించగా.. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని యాటమొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం తల్లుల వన ప్రదేశాలకు వెళ్లి రహస్య పూజలు చేశారు. కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో మేడారంలో సమ్మక్క గుడిలో, కొండాయిలో గోవిందరాజు గుడిలో, పునుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో ఈ పూజలు జరగ్గా.. పూజారులు కుటుంబీకులు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, సిద్దబోయిన మునీందర్, అరుణ్, అనిల్, కొక్కెర కృష్ణయ్య, రమేష్, పూర్ణచందర్, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

ముగిసిన జాతర.. భారీగా తరలొచ్చిన భక్తులు

ఈ నెల 7న గుడిమెలిగే పండుగ మొదలుకొని 14న మండమెలిగే పండుగ, 21, 22న వన దేవతలు గద్దెలకు చేరడం, 23న భక్తుల మొక్కులు, 24న వన ప్రవేశం జరిగింది. తదుపరి బుధవారం జరిగే తిరుగు జాతర పండుగ ముగియగా.. తిరుగువారం రోజున కూడా తల్లులు ఇక్కడే కొలువు దీరి ఉంటారనే నమ్మకంతో భక్తులు మేడారానికి పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జంపన్న వాగులో స్నానాలు ఆచరించి తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సమ్మక్కగుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సమ్మక్కగుడిలో పూజలు చేస్తున్న వడ్డెలు

ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే

మీ భరతం పడతా

- అమ్మను అడ్డుపెట్టుకుని పొన్నం రాజకీయం చేస్తున్నాడు
- పీవీ ఇంటికెళితే కడుపు మండిన కాంగ్రెసోళ్లు నాపై కోడిగుడ్ల దాడి చేశారు
- పాదయాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



ఎల్కతుర్తిలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 28 : ఇచ్చిన హామీ మేరకు 100రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయకపోతే ఆ పార్టీ నాయకుల భరతం పడతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. ఆయన చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో కొనసాగి.. రాత్రికి ఎల్కతుర్తి మండలంలోకి చేరుకుంది. మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి, దామెర, ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి గ్రామాల్లో పాదయాత్ర సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల అప్పులు చేస్తే అధికారం వచ్చిన 80రోజుల్లోనే కాంగ్రెసోళ్లు రూ.10వేల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజలు కాంగ్రెస్ నాయకులను తరిమి కొడతారని, తెల్ల రేషన్‌కార్డులున్న వారికే గ్యారెంటీలను అందిస్తామని చెప్పడం ప్రజలను తప్పు దోవ పట్టించడమేనని విమర్శించారు. రేషన్ కార్డులే ఇవ్వని ప్రభుత్వం గ్యారెంటీలను ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. రాముడి జన్మస్థలాన్ని ప్రశ్నించే వాళ్లను నేను నిలదీస్తే.. తన తల్లిని అవమానించానంటూ.. తల్లిని అడ్డుపెట్టుకుని ఈ ప్రాంత మంత్రి రాజకీయం చేస్తున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పరోక్ష ఆరోపణలుచేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తే అది ఆయన విజ్ఞతేనని, ఏ మూర్ఖుడు కూడా అమ్మను అడ్డుపెట్టుకుని విమర్శలు చేయరని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి చెందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు మృతి చెందితే ఆయన భౌతిక కాయాన్ని కూడా పూర్తిగా కాలనీయని పరిస్థితి తీసుక వచ్చిన చరిత్ర కాంగ్రెస్ వాళ్లది కాదా అని ప్రశ్నించారు. అలాంటి వ్యక్తి సేవలను గుర్తించి.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీవీ నర్సింహరావుకు భారతరత్నను ప్రకటించి గౌరవించిందన్నారు. అలాంటి వ్యక్తి కుటుంబాన్నికలిసేందుకు స్వగ్రామానికి వెళ్లితే కడుపు మండిన కాంగ్రెస్ నాయకులు తనపై కోడి గుడ్లతో దాడిచేశారని, రాళ్లు, కోడి గుడ్ల దాడులకు తాను భయపడే వ్యక్తిని కాదని, తనను అనవసరంగా గెలికారని, తాను కేసీఆర్‌కే భయపడలేదన్నారు. గతంలో కేసీఆర్ తెలంగాణను నాశనం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశం చేయడానికి కంకణం కట్టుకుందని మండిపడ్డారు. అగ్ర వర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా కేంద్రంలో 27 మంది బీసీలను, 12 మంది ఎస్సీలను, 8 మంది ఎస్టీలను కేంద్ర మంత్రులకు పట్టం కట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నియోజక వర్గ నేతలు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ కాన్వాయ్‌పై

కోడిగుడ్లతో దాడి

- హనుమకొండ జిల్లా వంగరలో ఉద్రిక్తత



వంగరలో పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీ బండి సంజయ్ (ఇన్‌సెట్‌లో కోడి గుడ్ల దాడిలో కింద పడిన గుడ్డు)

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28: ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోకి అడుగుపెట్టిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కొత్తకొండలోని హరితహోటల్‌లో రాత్రి బసచేశారు. అయితే పీవీకి భారతరత్న వచ్చిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన వంగరలోని పీవీ కుటుంబ సభ్యులను కలిసి.. పీవీ ఇంట్లోని పీవీ విగ్రహానికి నివాళులర్పించి, పీవీ మనువడు ఎన్వీ సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంగర నుంచి భీమదేవరపల్లికి వెళ్తుండగా వంగర బస్టాండ్ సమీపంలో బండి సంజయ్ కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసిరారు.

ఈ క్రమంలో బండి సంజయ్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి తాను బస చేసిన కొత్తకొండ హరిత హోటల్ వద్ద వందలాది మంది పోలీసులు మోహరించారని, కానీ బుధవారం తాను వంగరలో పీవీ ఇంటికి వెళ్లివస్తుండగా తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరగడం తీవ్ర బాధాకరమన్నారు. పోలీసుల వైఫల్యంతోనే తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ వైఫల్యమే దీనికి కారణమన్నారు. తమ కార్యకర్తలు బుధవారం ఉదయం వంగరలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందని అప్రమత్తం చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. దీంతో తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. తనకు పోలీసుల బందోబస్తు అవసరం లేదని, తమ కార్యకర్తలకే తనకు రక్షణగా ఉంటారని, పోలీసులు తిరిగి వెళ్లిపోవాల్సిందిగా ఆయన కోరారు. ఆ తర్వాత అక్కడి నుంచి బండి సంజయ్ వెళ్లిపోగా.. కోడిగుడ్ల దాడి జరిగిన క్రమంలో వంగరలో ఉద్రిక్తత ఏర్పడింది.

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడి



ములుగు కలెక్టర్, ఎస్పీలను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 28: మేడారం సమ్మక్క, సారలమ్మల చరిత్ర, మహాజాతర వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి చేస్తామని, జాతర సమగ్రాభివృద్ధికి పక్కాప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లాలో పర్యటించిన సీతక్క జాకారంలోని వైటీసీ భవనాన్ని పరిశీలించారు. రామప్ప నుంచి లక్నవరం సరస్సులోకి గోదావరి జలాల తరలింపుపై జిల్లా కలెక్టర్, నీటిపారుదలశాలక అధికారులతో చర్చించారు. ఆ తర్వాత మేడారం జాతర విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ములుగులోని గిరిజన భవన్‌లో కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తన 24ఏళ్ల రాజకీయ జీవితంలో పలుమార్లు మేడారం జాతర నిర్వహణను పరిశీలించానని, కానీ, తొలిసారి ప్రభుత్వ ప్రతినిధిగా ప్రత్యక్షంగా జాతరను జరిపించే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజులకే వచ్చిన మేడారం జాతరకు రెండు దఫాలుగా రూ.105కోట్ల నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశామని, కలెక్టర్, ఎస్పీ, అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాతరను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. కొన్ని లోపాలు తలెత్తాయని, వాటిని వచ్చే జాతరలో పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపడుతామని, జాతర సమగ్రాభివృద్ధి, భక్తులకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకోసం ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అధికారుల అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరుస్తామని, గత జాతరతో పోల్చుకుంటే ఈసారి భక్తుల సంఖ్య పెరిగిందని, అయినా అధికారుల సమయస్ఫూర్తితో వ్యవహరించి వసతులు కల్పించారన్నారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, తరగతుల నిర్వహణకు జాకారంలోని వైటీసీ భవనంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధుల కేటాయింపునకు సీఎం అంగీకరించారని, యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతామన్నారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ కోసం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని, కవరేజీ కోసం నూతనంగా మీడియా టవర్‌ను నిర్మించామన్నారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. స్వల్ప ట్రాఫిక్‌జామ్ మినహా జాతరను సక్సెస్ చేశామని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, గద్దెలు, జాతర పరిసరాల్లో రద్దీ నియంత్రణపై పక్కాగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, కలెకర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు, ములుగు జిల్లా మీడియా ప్రతినిధులను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, మేడారం ఈవో రాజేంద్రం, పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, ములుగు డీపీఆర్వో ఎమ్డీ.రఫిక్, ములుగు డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీపీవో తుల రవి, సీఐ రంజిత్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగా యి. బుధవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 40మంది రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఒకే చోట పని చేస్తున్న అధికారులకు స్థాన చలనం జరిగింది. సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న అర్రమాడ వెంకట్ రెడ్డిని హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ ములుగు అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్‌గా, పరకాల ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి కల్లూరు ఆర్‌డీవోగా, ఆదిలాబాద్ ఆర్‌డీవోగా పని చేస్తున్న స్రవంతి బ్రహ్మారౌతు వరంగల్ ఆర్‌డీవో, ఆర్మూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ టి.వినోద్‌కుమార్ భూపాలపల్లి ఎల్‌ఏ అండ్ ఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, భూపాలపల్లి ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.రమాదేవి మెదక్ ఆర్‌డీవోగా, వరంగల్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎం.వాసుచంద్ర నారాయణ్‌పేట్ ఆర్‌డీవోగా, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వి రామ్మూర్తి ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం)గా, హనుమకొండ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమేష్ సిరిసిల్ల ఆర్‌డీవోగా బదిలీ చేశారు.

హైదరాబాద్ స్పెషల్ ఎగ్జిగ్యూటివ్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ డి.కొముర‌య్య జనగామ ఆర్‌డీవోగా, జనగామ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మురళీక్రిష్ణారెడ్డి హైదరాబాద్ సెక్రెటరియేట్‌లో అధికార భాష ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్‌గా, ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టీడబ్ల్యు) డిప్యూటీ కలెక్టర్ డీఎస్ వెంకన్న స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా, నారాయణ్‌ఖేడ్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎన్.వెంకటేశ్ హనుమకొండ ఆర్‌డీవోగా, భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ, ఆర్‌అండ్‌ఆర్‌గా పనిచేస్తున్న కె.నారాయణరెడ్డి పరకాల ఆర్‌డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్టీజోన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 28: రాష్ట్ర పోలీసు విభాగం మల్టీ జోన్ -1 పరిధిలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ పరిధిలో 65 మందిని బదిలీ చేయగా పోలీసు కమిషనరేట్ నుంచి 7 గురు బదిలీ అయ్యారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఒ. రమేష్	వరంగల్ ఎస్బీ	కరీంనగర్ - 2 టౌన్
సీహెచ్ శ్రీధర్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
ఎన్.వెంకట్రాంనాయక్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
బి. శంకర్	సీసీఎస్ వరంగల్	సరెండర్ మల్టీ జోన్-1
ఎం. శివకుమార్	సిద్దిపేట	వరంగల్ కమిషనరేట్
ఎస్. రవికుమార్	మల్టీజోన్ -1	వరంగల్ కమిషనరేట్
పులి వెంకటి	వరంగల్	హుజూరాబాద్ రూరల్



రెవెన్యూ మేళాలో వినతుల స్వీకరణ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 28 : వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ మేళాలో వివిధ సమస్యలపై ప్రజలు వినతులు అందచేశారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో మేళా జరిగింది. ఆస్తి పన్ను, ఇంటి సవరణ, ఖాళీ స్థలాలకు పన్ను విధింపు తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా పర్యవేక్షకుడు అనిల్, సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న బల్దియా సిబ్బంది

క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : మాజీ సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో తమ సమస్యలను కలెక్టర్‌కు వారు వివరించగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాతిపల్లి రాజు, ఎలగంటి శ్రీనివాస్, సురేంద్రనాథ్, ఎం.సుధాకర్, కదారి భిక్షపతి, మంచాల రాజేష్, ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై విస్తృత ప్రచారం చేయాలి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 28: మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ బల్దియా సిబ్బందికి సూచించారు. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, బల్దియా సిబ్బందితో సమావేశం జరిగింది. పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణ, ప్రచారం, ఏర్పాట్లు, పోలియో బూత్‌ల ఏర్పాటు తదితర అంశాలను చర్చించారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్

ఉపాధి పనులను పరిశీలించిన డీఆర్‌డీవో

గీసుగొండ, ఫిబ్రవరి 28: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన మరియపురంలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను డీఆర్‌డీవో కౌసల్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ పనులను చూసి స్థానిక కార్యదర్శి స్వప్నను అభినందించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో చంద్రకాంత్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంహెచ్‌డీ దినోత్సవం

గీసుగొండ, ఫిబ్రవరి 28: మండలంలోని మొగిలిచర్లలో మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'రా వాటర్ సంప్'

• 2017లో తొలగించిన కెనాల్ లింక్ • చోరీకి గురవుతున్న యంత్రాలు • తుప్పు పడుతున్న విలువైన పరికరాలు • మందుబాబులకు అడ్డాగా మారిన వైనం • పట్టించుకోని మునిసిపల్ అధికారులు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 28 : వరంగల్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన 'రా వాటర్ సంప్ కమ్ పంప్ హౌస్' నిరుపయోగంగా మారింది. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గినప్పుడు వేసవిలో నీటి కొరత రాకుండా అత్యంత ప్రధానంగా వినియోగించే రా వాటర్ సంప్ సేవలను నిలిపివేయడంతో సుమారు ఏడు సంవత్సరాలుగా మూలనపడి ఉంది. దీంతో రూ.కోట్ల విలువైన యంత్రాలు, పరికరాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోవడమే గాక చోరీకి గురవుతున్నాయి.

వరంగల్ దేశాయిపేటలో సుమారు 35 సంవత్సరాల క్రితం రా వాటర్ సంప్ కమ్ పంప్ హౌస్‌ను నిర్మించారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గినప్పుడు ప్రజలకు తాగునీటికి ఇబ్బంది రాకుండా ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ గుండా ప్రవహించే నీటిని రా వాటర్ సంప్ హౌస్ ద్వారా సేకరించి ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో శుద్ధీకరణ చేసి సరఫరా చేసేవారు. అంతేకాక ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ నీటిని ఇదే రా వాటర్ సంప్ హౌస్ ద్వారా భద్రకాళి ఎస్‌ఎస్ ట్యాంకు(సమ్మర్ స్టోరేజి ట్యాంకు)లో సైతం నిల్వ చేసేవారు. రా వాటర్ సంప్ హౌస్‌కు మూడు విధాలుగా కనెక్షన్ ఉండటంతో నీరు సేకరించి నిల్వ ఉంచడం వల్ల ప్రజలకు నీటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. రోజుకు సుమారు 30 నుంచి 40వేల ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) సేకరించే రా వాటర్ సంప్ హౌస్‌కు కాకతీయ కెనాల్ నుంచి లింకు తొలగించడంతో నిరుపయోగంగా మారింది. దీంతో భద్రకాళి ఎస్‌ఎస్ ట్యాంకు సైతం నిరుపయోగంగానే మారింది.

2017లో తొలగించిన కెనాల్ లింక్

వరంగల్ మునిసిపల్ అధికారులు ప్రజలకు తాగునీటి సరఫరా కోసం భద్రకాళి బండ్(ఎస్‌ఎస్ ట్యాంకు), రా వాటర్ సంప్ హౌస్‌ను వినియోగించే వారు. రానురాను పూర్తి స్థాయిలో ధర్మసాగర్ రిజర్వాయర్ నీటిని వినియోగించడంతో 2017 సంవత్సరంలో కాకతీయ కెనల్‌కు రా వాటర్ సంప్ హౌస్‌కు ఉన్న లింకును తొలగించారు. దీంతో సుమారు ఏడు సంవత్సరాలకు పైబడి రా వాటర్ సంప్ హౌస్ నిరుపయోగంగా మారింది. దీంతో కేవలం ధర్మసాగర్ రిజర్వాయర్ మీదనే ఆధారపడాల్సి వస్తోంది.

సిబ్బంది సేవలేవీ?

రా వాటర్ సంప్ కమ్ పంప్ హౌస్ నిరుపయోగంగా మారడంతో అందులో పనిచేసే సిబ్బంది(హెల్పర్) సేవలు గాలికి వదిలేశారు. అటు భద్రకాళి ఎస్‌ఎస్ ట్యాంకులోని హెల్పర్లు, ఇటు రా వాటర్ సంప్ హౌస్ హెల్పర్లు నామమాత్రంగా కొనసాగుతున్నారు. కేవలం వారు విధులకు హాజరై ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో కూర్చొని వెళ్లడమే సరిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. హెల్పర్ల సేవలు మరో చోట ఎందుకు వినియోగించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. పలుచోట్ల సిబ్బంది లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఈ సిబ్బంది సేవలు మాత్రం వినియోగించుకోవడం లేదని ఆరోపణలు వెలువడుతున్నాయి



దేశాయిపేటలో నిరుపయోగంగా ఉన్న రా వాటర్ సంప్ కమ్ పంప్ హౌస్

మందుబాబులకు అడ్డాగా..

రా వాటర్ సంప్ హౌస్ నిరుపయోగంగా మారడంతో మందు బాబులకు వేదికగా మారుతోంది. రూ.కోట్ల విలువ చేసే పరికరాలకు భద్రత లేకపోవడంతో పలువురు పోకిరీలు అడ్డాగా మార్చుకొని మందు, పేకాట శిబిరంగా మార్చారు. అంతేగాక పలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు.

చోరీకి గురవుతున్న పరికరాలు

రా వాటర్ సంప్ హౌస్ నిరుపయోగంగా మారడంతో మునిసిపల్ అధికారులు పూర్తిగా విస్మరించారు. రా వాటర్ సంప్ హౌస్ వద్ద ఎలాంటి సిబ్బంది, సెక్యూరిటీ గాని ఏర్పాటు చేయలేదు. దీంతో కోట్ల విలువైన పరికరాలు, యంత్రాలు చోరీకి గురవుతున్నాయి. అంతేకాక నిరుపయోగంగా ఉండటంతో యంత్రాలు తుప్పు పట్టి పాడైపోతున్నాయి. రూ.కోట్ల విలువైన ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని అధికారుల తీరుపై ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి రా వాటర్ సంప్ హౌస్ వద్ద సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి పరికరాలు చోరీకి గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





పాడైపోతున్న యంత్రాలు, పరికరాలు



రా వాటర్ సంప్‌హౌస్‌లో మద్యం సీసాలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చెల్లని రూపాయిలు..

(5వ పేజీ తరువాయి)

హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పైడిపల్లి పృథ్వీరాజ్, మాచర్ల కుమార్, దొంగల కొంరయ్య, అంబీరు కవిత, గుండేల్లి సదానందం, నోముల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ పాదయాత్ర

భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ, గట్లనర్సింగాపూర్, వంగర, భీమదేవరపల్లి, ముల్కనూర్ గ్రామాల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. భీమదేవరపల్లిలో మహిళలు పూలు చల్లారు. కొత్తకొండ, ముల్కనూర్ గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని మళ్లీ తీసుకురావాలని దేశ ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. అవినీతిరహిత పాలన కేవలం బీజేపీకే సాధ్యమవుతుందన్నారు. ఇతర పార్టీల లాగా బీజేపీ పార్టీలో కుటుంబ పాలన ఉండదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌తో సెల్ఫీలు దిగేందుకు యువతి యువకులు పోటీ పడ్డారు. బుధవారం రాత్రికి సంజయ్ పాదయాత్ర ఎల్కతుర్తి మండలంలోకి ప్రవేశించింది.

నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

• కలెక్టర్ ప్రావీణ్య • అధికారులతో సమీక్ష


వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని మండలాలు, మునిసిపాలిటీల పరిధిలో అందించే నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో తిరిగి నీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. అన్ని గ్రామాల్లో బోర్ల మరమ్మతులు, ఫ్లెషింగ్ చేయాలని ఆదేశించారు. తాగునీటిని వృథా చేయకుండా గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యాచరణ ప్రణాళికపై వారం లోగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. మండలాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, పైపులైన్ లేని ప్రదేశాల్లో ట్యాంకర్ల సహాయంతో నీటి సరఫరా జరిగేలా చూడాలని వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఎంపీడీవోలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్యాంకులను శుభ్రంగా ఉంచి వ్యాధులను నివారించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్ఈ రాములు, బీసీ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

జ్యోతిషంలో పట్టా అందుకున్న సుదర్శనాచార్యులు

వరంగల్, ఫిబ్రవరి 28 : జ్యోతిషంలో ప్రతిభ కనబర్చిన సముద్రాల సుదర్శనాచార్యులు పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో ఆయనకు పట్టాను ప్రదానం చేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన సుదర్శనాచార్యులు యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, వైస్ చాన్స్‌లర్ ఆచార్య తంగెడ కిషన్‌రావుల చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏలో జ్యోతిషం పూర్తి చేశారు. యూనివర్సిటీ అధికారుల ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. రిజిస్ట్రార్ భట్టు రమేష్‌తో పాటు పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు. కాగా, సంగెం మండలం చింతలపల్లిలోని భవానీ శంకర ఆలయం, ఊకల్‌లోని శ్రీనాగసుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రధాన పూజారిగా పనిచేస్తున్న సుదర్శనాచార్యులను పలువురు అభినందించారు.



పట్టా అందుకున్న సుదర్శనాచార్యులు

జిల్లా సైన్స్ అధికారికి ప్రభుత్వ ప్రత్యేక ప్రశంస

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 28: వరంగల్ జిల్లా విద్యాశాఖలో సైన్స్ అధికారి(డీఎస్‌వో)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కట్ల శ్రీనివాస్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రశంసా పత్రం అందజేసింది. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ చేతుల మీదుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. డీఎస్‌వో, జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్ అయిన డాక్టర్ శ్రీనివాస్ మేడారం మహాజాతర సందర్భంగా ప్రజల్లో పర్యావరణ స్పృహ కల్పించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రశంసా పత్రంతో గౌరవించింది. ఈ సందర్భంగా డీఈవో వాసంతితో పాటు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డీటీసీని కలిసిన లారీ అసోసియేషన్ సభ్యులు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 28: వరంగల్ జిల్లా డీటీసీ గంధం లక్ష్మి, ఎంవీఐలు స్వర్ణలత, శ్రీనివాస్‌ను ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్, కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లాల్ అహ్మద్, సలీమ్, అహ్మద్‌ఖాన్, నర్సింహరావు, లారీల యజమానులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో రూ.153 కోట్లతో అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 28 : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 13 డివిజన్లలో రూ.153కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు మేయర్ గుండు సుధారాణి వెల్లడించారు. మొత్తం 815 పనుల్లో రూ.91కోట్లు వ్యయంతో చేపట్టిన 600 పనులు పూర్తి అయినట్లు ఆమె పేర్కొన్నారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధానకార్యాలయంలో 13 డివిజన్ల కార్పొరేటర్లతో మేయర్ సమీక్ష నిర్వహించారు. విలీన గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

వరంగల్, ఫిబ్రవరి 28: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. సంగెం మండలంలోని షాపూర్‌లో పంచాయతీ కార్యాలయం, డంపింగ్ యార్డు, నర్సరీలను బుధవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి వాడలోని ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెరుగుదలకు తగు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు వెంటనే తరలించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో కొమురయ్య, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను క్రమపద్ధతిలో ఉంచాలని డీఎల్‌పీవో వేదవతి అన్నారు. సంగెం మండలం గవిచర్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, డంపింగ్ యార్డు, నర్సరీలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్నులను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గీసుగొండ, ఫిబ్రవరి 28: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అన్నారు. గీసుగొండలోని జడ్పీ పాఠశాలలో బుధవారం బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పట్టాభి, పీఈటీ కృష్ణ, యువ కేంద్రం వలంటీర్ భిక్షపతి, సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

మట్టెవాడ, ఫిబ్రవరి 28: వరంగల్ కాశిబుగ్గలోని స్టాండెడ్ పబ్లిక్ స్కూల్, చార్‌బౌళి, ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్‌ల్యాండ్ పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్టాండెడ్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణాకర్‌రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు మధుకర్, ప్రియాంక, వేణుగోపాల్, హరిప్రియ, రమేశ్, రవితేజ పాల్గొన్నారు. లర్నర్స్ ల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ తాళ్ల మల్లేశం పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను తిలకించి అభినందించారు. వరంగల్ చౌరస్తాలో వరల్డ్ టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ డే జెండాను ఆవిష్కరించి సీట్లను పంపిణీ చేశారు.

● వరంగల్ : నగరంలోని రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో విద్యార్థులు పలు ఎగ్జిబిట్లతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ శేర్ల అనిల్‌కుమార్ దైనందిన జీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అరవింద జీనియస్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు పలు ఆవిష్కరణలను చేసి ప్రదర్శించారు. కరస్పాండెంట్ పంచకం నర్సయ్య, రాజులు విద్యార్థులకు బహుమతులు అందించారు. శంభునిపేటలోని లిటల్ లారెన్స్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఎంఈవో విజయ్‌కుమార్, తెలంగాణ ప్రైవేటు విద్యా సంస్థల రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నెమరుగొమ్ముల రమేష్, ప్రిన్సిపాల్ సింగారపు రాజులు విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించి అభినందించారు. పాఠశాల ఇంచార్జి హబీబా అక్తర్, అనిత, రెహానా, రమ్య, స్వప్న, రమ్యకృష్ణ, మానస, శ్రీవిద్య, ఆలియా, ఇందుమతి, గౌస్ పాల్గొన్నారు.

● ఏకశిలానగర్ : జాతీయ సైన్స్ డేను అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని కివీ హైస్కూల్‌లో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సైన్స్, కల్చరల్ ఎగ్జిబిట్లతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి, అన్నదేవర ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ రజినీలు ఎగ్జిబిట్లను ప్రారంభించి ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. ఎగ్జిబిట్లకు గైడ్‌లుగా వ్యవహరించిన దివ్యశ్రీ, మంజుల, శాంతకుమారి, స్వాతి, స్వప్న, లక్ష్మి, సంగీత, సరిత, రంజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వరంగల్ : సంగెం మండలం గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. 8వ తరగతి చదువుతున్న వర్షిక్ ప్రదర్శించిన హైడ్రాలిక్ సైకిల్ పలువురిని ఆకర్షించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహేమాన్‌ముజాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పోశాల మధు, డైరెక్టర్స్ మినుముల రాజు, మైదంశెట్టి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. మచ్చాపూర్ ప్రగతి, రెడ్డిపాలెం విద్యానిలయ హైస్కూల్, ధర్మారం విజ్ఞాన్ హైస్కూల్, సెయింట్‌జాన్ హైస్కూల్‌లలో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చింతం శ్రీనివాస్, కోటిరెడ్డి, సూర్యనారాయణ, మేరి, విద్యార్థులు పాల్గొన్నారు.



శంభునిపేటలోని లిటిల్ లారెన్స్ హైస్కూల్‌లో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో విజయ్

● ఖిలావరంగల్ : ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను అర్థం చేసుకొని వాటిని తిరిగి ప్రయోగాల ద్వారా చేసినప్పుడే విద్యార్థులకు అవగాహన వస్తుందని మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్య అన్నారు. బుధవారం ఖిలావరంగల్ రోడ్‌లోని ట్యాలెంట్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ ముక్కెర రవిందర్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మైదం రాజు ఉత్తమ ప్రయోగాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, రజితారెడ్డి, ప్రశాంత్, జరీనా, రాధా, మౌనిక, సుజాత, వీణ, రుబీనా, గౌతమి, దేవేందర్, అజీమ్, హేమలత, సాయి, అరుణ్, అవినాష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలతో ఉజ్వల భవిష్యత్

సైన్స్ ప్రయోగాలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. 34వ డివిజన్ శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికితీసే విధానం చాలా బాగుంటుందన్నారు. ఎగ్జిబిట్స్‌ను తయారు చేయించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్‌లో సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు



మునిసిపాలిటీ కార్యాలయంలో అధికారుల తనిఖీ

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 28 : నర్సంపేట మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. 2019 లో కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన వెంకటేశ్వర్‌రావుపై నమోదైన ఏసీబీ కేసు విచారణ నిమిత్తం సిద్ధిపేట మునిసిపల్ కమిషనర్ ప్రసన్నరాణి ఆధ్వర్యంలో అధికారులు 2019 నాటి రికార్డులను తనిఖీ చేసి, ఉద్యోగులతో మాట్లాడారు. విచారణకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. వీరి వెంట నర్సంపేట మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఉన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

• కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని మండలాలు, మునిసిపాలిటీల పరిధిలో అందించే నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభమైన దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో తిరిగి నీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలన్నారు. అన్ని గ్రామాల్లో బోర్ల మరమ్మతులు, ఫ్లెషింగ్ చేయాలని ఆదేశించారు. తాగునీటిని వృథా చేయకుండా గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యాచరణ ప్రణాళికపై వారం లోగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. మండలాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, పైపులైన్ లేని ప్రదేశాల్లో ట్యాంకర్ల సహాయంతో నీటి సరఫరా జరిగేలా చూడాలని వర్ధన్నపేట, నర్సంపేట మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఎంపీడీవోలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్యాంకులను శుభ్రంగా ఉంచి వ్యాధులను నివారించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్‌ఈ రాములు, బీసీ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


విద్యార్థులకు పతకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 28 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని గురిజాల గ్రామంలోని ఎంపీపీఎస్, జడ్పీపీఎస్ పాఠశాలలో మంగళవారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది నేడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్య, క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు, బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల రమేష్, గుర్రం అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి


ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న రవీందర్‌రావు

రాయపర్తి, ఫిబ్రవరి 28 : విద్యార్థులు చిన్నప్పటి నుంచి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు చెప్పారు. మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రంగంలోని పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు నోముల రంగయ్యను ఆయన అభినందించారు. జన్మనిచ్చిన గ్రామంలో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల ప్రగతికి కృషిచేస్తున్నందుకు గ్రామస్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో సకల సౌకర్యాలను కలిపించడంతో పాటు విద్య రంగంలో పాఠశాలను అగ్రస్థానంలో నిలిపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, రవీందర్, శైలజ, మాజీ సర్పంచ్‌లు స్వామి, రాజయ్యలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

నెక్కొండ వైస్ ఎంపీపీగా శ్రీనివాస్

• బీఆర్‌ఎస్‌కు దక్కిన విజయం
• ఫలించని కాంగ్రెస్ ప్రయత్నాలు
• పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక పూర్తి


కర్పూరపు శ్రీనివాస్

నెక్కొండ, ఫిబ్రవరి 28 : మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడిగా మండలంలోని అలంకానిపేట ఎంపీటీసీ సభ్యుడు కర్పూరపు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల అధికారి డాక్టర్ బి. నర్సింహారెడ్డి బుధవారం ఈ ఎన్నిక నిర్వహించగా.. మండలంలో 16 మంది ఎంపీటీసీలకు గాను ఒకరు మృతి చెందడంతో మిగతా 15మంది హాజరయ్యారు. ఈ ఉపాధ్యక్ష పదవి కోసం బీఆర్‌ఎస్‌కు చెందిన అలంకానిపేట ఎంపీటీసీ కర్పూరపు శ్రీనివాస్, కాంగ్రెస్ పత్తిపాక ఎంపీటీసీ బండారుపల్లి వినయకుమారి నామినేషన్ దాఖలు చేయగా.. ప్రత్యక్ష పద్ధతి (చేతులు ఎత్తడం)లో జరిగిన ఈ ఎన్నికలో శ్రీనివాస్‌కు 8 ఓట్లు రాగా, వినయకుమారికి 7 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఎంపీపీ జాటోతు రమేశ్, ఎంపీడీవో ఎలూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

• బందోబస్తు మధ్య సాగిన ఎన్నిక

నెక్కొండ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్ష పదవి కోసం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సభ్యులు పోటీ పడటంతో వైస్ ఎంపీపీ ఎవరికి దక్కుతుందోననే విషయమై వారం రోజులుగా ఉత్కంఠ కనిపించింది. అయితే ఒక్క ఎంపీటీసీ మాత్రమే మెజార్టీ ఉన్న బీఆర్‌ఎస్ తమ ఎంపీటీసీలతో క్యాంపు నిర్వహించగా.. ఎలాగైనా పదవి దక్కించుకోవాలనుకున్న కాంగ్రెస్ కూడా చివరి వరకూ తీవ్ర ప్రయత్నాలు చేసింది. కానీ కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నిక నేపథ్యంలోఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నెక్కొండ మండల కేంద్రంలో ఏసీపీ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, 60 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


నెక్కొండ ఉపాధ్యక్షుడి ఎన్నికల్లో పాల్గొన్న ఎంపీటీసీలు

• కాంగ్రెస్‌ను ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొన్నాం
బీఆర్‌ఎస్ నాయకులు

మెజార్టీ ఎంపీటీసీల లేకపోయినా అప్రజాస్వామికంగా నెక్కొండ మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు చేసిన ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టామని, తమ పార్టీ ఎంపీటీసీలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని నెక్కొండ ఎంపీపీ జాటోతు రమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సొసైటీ చైర్మన్ మారం రాము అన్నారు. తమ పార్టీ ఎంపీటీసీ శ్రీనివాస్ వైస్‌ఎంపీపీగా గెలిచిన నేపథ్యంలో వారు అంబేడ్కర్ సెంటర్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరం రాజిరెడ్డి, దొనికన సారంగపాణి, తాటిపల్లి శివ, గంటుక సోమయ్య, హరికిషన్, నరేంధ్యార్‌రెడ్డి, వీరభద్రం, ఖలీల్, వాగ్యానాయక్, రవి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


నర్సంపేటలో విజ్ఞాన ప్రదర్శనను పరిశీలిస్తున్న టీచర్లు


వర్ధన్నపేటలో ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


సిద్ధార్థలో కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎం కర్ణాకర్‌రెడ్డి

నర్సంపేటటౌన్, ఫిబ్రవరి 28: సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని నర్సంపేట పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీఅభ్యాస్ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ సందర్శించి పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నరహరి రాజేందర్‌రెడ్డి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు. మాంటిస్సోరి హైస్కూల్‌లో జరిగిన సైన్స్ సంబరాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను ఎస్సై రవి, పాఠశాల చైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డిలు పరిశీలించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

• చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై మరింతగా అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు నూతన విషయాలపై ఇన్నోవేషన్ ప్రక్రియను చేయాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలను వినియోగించుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి సైంటిస్టు కావాలన్నారు. అలాగే మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం జయ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సైన్స్‌లో పోటీలను నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్, సీహెచ్ మాధవి, సునిత, ఉదయ్, కుమార్; మాధవి, మమత, కృష్ణా, వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• వరంగల్ : నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని సైన్స్‌దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు, విజ్ఞానశాస్త్ర భావనలు స్ఫూరించే వివిధ రకాల రంగోళీలు, చిత్రపటాలు, క్విజ్ తదితర కార్యక్రమాలను విద్యార్థులకు నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండెం కాంతారావు, పూర్వపాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు వినోద ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్, వాణి, కౌరి, అనంతిన, నరేందర్, రాధిక, రవి, నిర్మల, సుజాత, విజయలక్ష్మి, పద్మ, కనకయ్య సిబ్బంది పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి జ్యోతిరావు పూలే విద్యాలయంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ, రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రిన్సిపాల్ దేవేందర్ నివాళి అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశీలనచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, సుకుమార్, బషీర్, సునిత, సోమారాణి, సమత, శారద, వీరేందర్, లక్ష్మన్, సతీష్, అనితలు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిట్లను ఏర్పాటుచేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు పరిశోధనలు నిర్వహించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కొటం ధనలక్ష్మి తయారుచేసిన వ్యర్థపదార్థాలతో జీవ శాస్త్ర నమూనాలు పిల్లలను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు సైతం ఎగ్జిబిట్లను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, మనుజేందర్‌రెడ్డి, వంశీమోహన్, దేవయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, అశోక్, సునీత తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : మనిషిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించే సాధనమే సైన్స్ అని నెక్కొండలోని విద్యోదయ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చల్లా నాగార్జున్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో సైన్స్ దినోత్సవం సంబురాలను ఘనంగా జరిపారు. ప్రతీ విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చల్లా పారిజాతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

•వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఉప్పరపెల్లి ప్రభుత్వ పాఠశాలలో, ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఐనవోలు మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు ఉషారాణి, విజయ, అరుణదేవి, వీరస్వామి, జావిద్ పాల్గొన్నారు.

• వరంగల్ : సైన్స్ దినోత్సవ వేడుకలను పర్వతగిరి మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విశ్వజెనిత్ పాఠశాల, విజ్‌డమ్ స్కూల్, కేజీబీవీ, కొంకపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను తయారుచేసి ప్రదర్శించారు. ఉత్తమ ఎగ్జిబిట్లకు ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎర్రబల్లి హరికుమార్, దేవేందర్, నాజియాసల్మా, భిక్షపతి, ఉపాధ్యాయులు విశ్వనాధశర్మ, కృష్ణమూర్తి,వెంకట్రాంనర్సయ్య, కుమారస్వామి, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చెల్లని రూపాయిలు..

(5వ పేజీ తరువాయి)

హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పైడిపల్లి పృథ్వీరాజ్, మాచర్ల కుమార్, దొంగల కొంరయ్య అంబీరు కవిత, గుండేల్లి సదానందం, నోముల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

• సంజయ్ పాదయాత్ర

భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ, గట్లనర్సింగాపూర్, వంగర, భీమదేవరపల్లి, ముల్కనూర్ గ్రామాల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో బండి సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. భీమదేవరపల్లిలో మహిళలు పూలు చల్లారు. కొత్తకొండ, ముల్కనూర్ గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని మళ్లీ తీసుకురావాలని దేశ ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. అవినీతిరహిత పాలన కేవలం బీజేపీకే సాధ్యమవుతుందన్నారు. ఇతర పార్టీల లాగా బీజేపీ పార్టీలో కుటుంబ పాలన ఉండదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌తో సెల్ఫీలు దిగేందుకు యువతి యువకులు పోటీ పడ్డారు. బుధవారం రాత్రికి సంజయ్ పాదయాత్ర ఎల్కతుర్తి మండలంలోకి ప్రవేశించింది.

నర్సరీల పరిశీలన

వరంగల్, ఫిబ్రవరి 28 : పర్వతగిరి మండలంలోని మూడెత్తులతండా, శ్రీనగర్, మల్యాతండా, చింతనెక్కొండ, భట్టుతండా, తూర్పుతండా, గుగులోత్ తండా, ఏనుగల్లు గ్రామాల్లోని నర్సరీలను బుధవారం ఎంపీడీవో మాలోత్ శంకర్ పరిశీలించి, మాట్లాడారు. అన్ని గ్రామాల్లో వంద మంది కూలీలతో ఉపాధిహామీ పనులు చేయించాలని, అన్ని నర్సరీలలో వేసవి తాపానికి మొక్కలు తట్టుకునే విధంగా షేడ్‌నెట్‌లను వేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి


నర్సంపేట సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 28 : భారతీయ జనతా పార్టీ పాలనలోనే నేడు దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. విజయసంకల్పయాత్ర ఖానాపురం మండలం మంగళవారిపేట మీదుగా నర్సంపేట పట్టణానికి బుధవారం రాత్రి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెల్తూ ప్రపంచంలోనే బలమైన దేశంగా అవతరించిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అత్యధికంగా కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలిపించి మరోసారి మోడీనీ ప్రధానిని చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గరికపాటి మోహన్‌రావు, ఎం. ధర్మారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, కంభంపాటి పుల్లారావు, రేసు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ పాల్గొన్నారు.

• ఖానాపురం : బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం రాత్రి మండలంలోకి చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారిపేటలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున, మహిళలు మంగళహారతులు బోనాలు, బతుకమ్మలతో యాత్రకు స్వాగతం పలికారు. యువమోర్చా కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. మంగళవారిపేట, బుధరావుపేట, ఖానాపురం మీదుగా విజయ సంకల్పయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ధర్మరావు, గరికపాటి మోహన్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, గంట రవికుమార్, కంభంపాటి ప్రతాప్, రాణాప్రతాప్‌రెడ్డి, ఆబోతు రాజు, లింగబత్తుల యాకసాయన్న, జల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయా లని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర భద్రకాళి, కాకతీయ ఐదవ క్లస్టర్ వరంగల్ పార్లమెంట్, వర్ధన్నపేట నియోజకవర్గంలో మార్చి 1వ తేదీన వర్ధన్నపేటకు చేరు కోనుంది. యాత్ర అనంతరం పట్టణ కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభా స్థలాన్ని బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, వర్ధ న్నపేట మాజీఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌లు మాట్లా డుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర నిర్వహి స్తున్నట్లు తెలిపారు. మరోసారి భారత ప్రధానిగా నరేంద్రమోదీని గెలిపించాలనే లక్ష్యంతోనే ప్రజా సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర, బహిరంగ సభలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర ప్రముఖ్, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతి రెడ్డి, యాత్ర సహా ప్రము ఖ్ కందిమళ్ల మహేశ్, నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, నాంపెల్లి యాకయ్య, గద్దం మహేందర్, పొనుగోటి వెంకట్‌రావు, పెద్దూరి రాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


నర్సంపేటలో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం నర్సంపేటలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల కళాశాల, కాకతీయ గ్రాడ్యుయేట్స్ తదితర పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలను రాశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని ఇంటర్ బోర్డు స్పష్టం చేయడంతో విద్యార్థులు 8.30 గంటల వరకే పరీక్షాకేంద్రాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.


• రాయపర్తి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రంలో 207మంది విద్యార్థులకుగాను 197 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. ఎలాంటి ఘటనలు జరగకుండా వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, ఎస్‌ఐ సందీప్ కుమార్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

• వరంగల్ : పర్వతగిరిలో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేయగా, మోడల్‌స్కూల్‌లో 191 మంది విద్యార్థులు పూర్తిగా హాజరయ్యారు. సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 174 మందికి గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఘనంగా టైలర్స్ డే

నెక్కొండ, ఫిబ్రవరి 28 : నేటి ఆధునిక యుగంలో రెడిమేడ్ విస్తృతంగా వ్యాప్తిచెందడంతో కుల వృత్తులపై ఆధారపడిన టైలర్లు జీవనోపాధిని కోల్పోయి దుర్భరమైన జీవనం సాగిస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని వరంగల్ జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ అన్నారు. నెక్కొండ ఇందిరాగాంధీ సెంటర్‌లో బుధవారం టైలర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కుట్టు మిషన్ సృష్టికర్త ఎలియాస్‌హోవే చిత్రపటానికి పూలమాలలువేసి అనంతరం జెండాను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం మండల కార్యదర్శి కొత్తకొండ గణేశ్, నాయకులు సంఘం వెంకటేశ్వర్లు, పెండ్యాల శ్రీనివాస్, సురేష్, రామగిరి సతీష్, లక్ష్మియ్య, వరుణ్, రామ్మోహన్, ఓంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా వెంకన్న బాధ్యతల స్వీకరణ



వరంగల్, ఫిబ్రవరి 28: పర్వతగిరి మండల ఎస్సైగా గుగులోత్ వెంకన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై వీరభద్రరావు కమలాపూర్ మండలానికి బదిలీపై వెళ్లాడు. మిల్స్‌కాలనీలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న వెంకన్న పర్వతగిరికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్‌ఝూను హన్మకొండ లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఐగా రాజగోపాల్..




దుగ్గొండి, ఫిబ్రవరి 28 : దుగ్గొండి సర్కిల్ సీఐగా బదిలీపై వచ్చిన సీఐ బి. రాజగోపాల్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. దుగ్గొండి సీఐగా పని చేసిన శ్రీనివాస్ పర్వతగిరికి బదిలీ కాగా, పర్వతగిరిలో సీఐగా విధులు నిర్వహిస్తున్న బి.రాజగోపాల్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనివాస్ పార్ల మెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా బదిలీ కాగా, 2004 బ్యాచ్‌కి చెందిన సీఐ రాజగోపాల్ ఆయన స్థానంలో బదిలీలో వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ బాబా




నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహమ్మద్ బాబా (డిష్ బాబా)ను నియమిస్తూ నియామక పత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అందజేశారు. బాబా మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ పార్టీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓర్సు తిరుపతి, వేముల సాంబయ్యగౌడ్, సారంగంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా ప్రశాంత్ ఎంపిక



ఖానాపురం, ఫిబ్రవరి 28 : మండల కేంద్రానికి చెందిన గొట్టపు ప్రశాంత్ హై కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్‌ప్లీడర్)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేయగా అందులో ప్రశాంత్ ఒకరు. 2016లో కాకతీయ యూనివర్సిటీలో న్యాయ శాస్త్రం అభ్యసించిన ప్రశాంత్ కొన్నేళ్లుగా హై కోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. నిరుపేద వ్యవసాయ కూలీలైన గొట్టపు సోమయ్య- సత్యవతి దంపతుల కుమారుడు ప్రశాంత్ హై కోర్టు అసి స్టెంట్ ప్లీడర్‌గా ఎంపికవ్వడంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన నాయకులు


చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

వరంగల్, ఫిబ్రవరి 28 : వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన హజ్మతుల్లా హుస్సేనిని పర్వతగిరి మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, నాయకులు మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.